క్లుప్తంగా

రంజాన్ మాసంలో దానం చేయండి



పాయకాపురం(విజయవాడరూరల్): రంజాన్ మాసంలో పేద ముస్లింలకు దానం చేస్తే పుణ్యం వస్తుందని ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్‌మీరా అన్నారు. సోమవారం కండ్రికలో కమిటీ సభ్యుల సమావేశం జరిగింది. నాగుల్‌మీరా మాట్లాడుతూ రంజాన్ మాసం ఎంతో పవిత్రమైందన్నారు. పేదవారిని ఆదుకోవడానికి అందరూ దానం చేయాలన్నారు. కేదారేశ్వరపేట ప్రాంతానికి చెందిన షేక్ ఖజావలీని ఎన్టీఆర్ జిల్లా ఆజాద్ ముస్లిం కమిటీ యూత్ అధ్యక్షుడిగా నియామకపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ ప్రధాన కార్యదర్శి మౌలానా షేక్ సాజిద్ అలీ, 61వ డివిజన్ సహాయ కార్యదర్శి హజరత్ మహమ్మద్ జానీ, పలువురు కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థులు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని నాన్ ఇన్‌స్టిట్యూషనల్ కేర్ ప్రొటెక్షన్ ఆఫీసర్ జాన్సన్ అన్నారు. దుర్గాపురం ఎస్టీవీఆర్ నగరపాలక సంస్థ పాఠశాలలో సోమవారం బేటీ బచావో, బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఏసీడీపీఓ డి.జోత్స్న ఆధ్వర్యాన విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత ప్రాధాన్యాన్ని వివరించారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యకర సమాజ సాధనకు కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన సందేహాలను నివృతి చేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయ తదితరులు పాల్గొన్నారు.

చెస్ టోర్నీ విజేతలకు బహుమతులు



విజయవాడస్పోర్ట్స్: ఆంధ్రా లయోల కాలేజీలో సోమవారం జరిగిన ఎన్టీఆర్ జిల్లా స్థాయి చెస్ టోర్నమెంట్ విన్నర్ ట్రోఫీని కె.భావన్, రన్నర్ ట్రోఫీని జె.మల్లేశ్వరరావు అందుకున్నారు. వైఈఎస్–జె ఆధ్వర్యంలో మ్యాజిక్ యూత్ నిర్వహించిన పోటీలు రసవత్తరంగా సాగాయి. టోర్నీలో మూడో స్థానాన్ని ఎం.బాబుశామ్యూల్ సాధించాడు. కాలేజీ ఆవరణలో సాయంత్రం జరిగిన ముగింపు కార్యక్రమంలో ఉమెన్ గ్రాండ్‌మాస్టర్ నూతక్కి ప్రియాంక విజేతలకు ట్రోఫీలు, మెడల్స్, రూ.20 వేల నగదు బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో ఆంధ్ర లయోల సంస్థల రెక్టర్ ఫాదర్ పి.ఆర్.జాన్, వైఈఎస్–జె వ్యవస్థాపకులు ఫాదర్ బాల బొల్లినేని, మ్యాజిక్ యూత్ ప్రతినిధులు ఎం.మణిరాజు, పి.నదియా, వి.లోకేష్, ఎ.ప్రేమ్‌కుమార్, సి.హర్షిత, ఎ.అఖిల పాల్గొన్నారు.

'హస్తకళల' ఉత్పత్తులకు మార్కెటింగ్ సాకర్యం



లబ్బీపేట(విజయవాడతూర్పు): గ్రామీణ హస్త కళాకారులతో తయారు చేసిన ఉత్పత్తులకు మార్కెటింగ్ సాకర్యం కల్పించి, ఉపాధి అవకాశాలు మెరుగు పరచనున్నట్లు నాబార్డ్ జనరల్ మేనేజర్ కేవీఎస్ ప్రసాద్ అన్నారు. నాబార్డు ఆర్థికసాయంతో పీవీపీ మాల్‌లో ఏర్పాటు చేసిన హస్త కళా ఉత్పత్తుల అమ్మకాల ముగింపు కార్యక్రమంలో కేవీఎస్ ప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ నాబార్డ్ ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలు, యువతకు హస్తకళా ఉత్పత్తులపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నేస్తం సంస్థ సీఈఓ సురేష్, నాబార్డు ఏజీఎం మిలింద్ చౌసాల్కర్, నేస్తం డైరెక్టర్ నందిని తదితరులు పాల్గొన్నారు.

సొంతింటి కల సాకారం చేస్తాం

మధురానగర్(విజయవాడసెంట్రల్): బీఎల్‌సీ స్కీంను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చి పేదల సొంతింటి కలను సాకారం చేస్తామని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. అజిత్‌సింగ్‌నగర్ ఎమ్మెల్యే కార్యాలయంలో సోమవారం బీఎల్‌సీ స్కీం దరఖాస్తుదారులు, అధికారులతో సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ సెంట్రల్ నియోజకవర్గంలో బీఎల్‌సీ స్కీంకు దరఖాస్తు చేసుకున్న వారిలో 2,140 మందిని ఎంపిక చేశారన్నారు. 140 మందికి మంజూరు పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో నవనీతం సాంబశివరావు, ఘంటా కృష్ణమోహన్, ఎరుబోతు రమణ, హౌసింగ్ అధికారులు విజయ్‌బాబు, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పట్టాలకు ఎదురుచూపులు

- దేవీనగర్ నాలుగో రోడ్డువానులకు పట్టాలిచ్చేనా..
- గత ప్రభుత్వం ప్రత్యేక చొరవ

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఇంటి పట్టాల కోసం ఎదురుచూస్తున్నారు దేవీనగర్ నాలుగో రోడ్డు ప్రజలు. వన్‌టౌన్ బోడెమ్మ హోటల్ సెంటర్ సమీపంలో కొంతకాలం క్రితం నిరుపేదల నివాసాలను తొలగించి ప్రత్యామ్నాయంగా దేవీనగర్ నాలుగో రోడ్డులో 32 మందికి ఒక్కొక్కరికి 24 గజాల చొప్పున ఇంటి స్థలం కేటాయించారు. వారికి ఇళ్లు కట్టించి ఇచ్చారు. ఇంటి పట్టాలను మాత్రం ఇవ్వలేదు. మీ ఇంటి పట్టాలు ఇచ్చేస్తున్నామంటూ పాలకులు.. అధికారులు హడావుడి చేయటం తప్ప ఇక్కడ మాత్రం పనులు ముందుకు జరగటం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వారికి ఇబ్బందులు

ఇంటికి పట్టాలు లేకపోవడంతో ఇంటిపై రుణం ఇవ్వటం లేదని దీంతో పిల్లల చదువులు, పెళ్లిళ్లు, వైద్య ఖర్చులకు ఇబ్బందులు పడాల్సి వస్తోంది వాపోతున్నారు.

ఇంటి పట్టా వస్తుందని ఆశగా ఎదురు చూస్తున్నామని ఇంతలో ప్రభుత్వం మారిపోవడంతో సమస్య మళ్లీ మొదటికి వచ్చిందని స్థానికులు వాపోతున్నారు. ప్రస్తుత కూటమి పాలనలో ఇంటి పట్టాలు ఇవ్వాలంటూ అధికారులు, పాలకుల చుట్టూ ప్రదక్షిణ చేస్తూనే ఉన్నారు. అధికారులు అదిగో ఇదిగో అంటూ కాలయాపన తప్ప పట్టాలు ఇవ్వడం లేదని వాపోతున్నారు.



దేవీనగర్ నాలుగో రోడ్డులో ఇంటి పట్టాలు ఇవ్వాల్సిన నివాసాలు ఇవే

సమస్య మొదటికి..



ఇంతలో ప్రభుత్వం మారడంతో సమస్య మొదటికి వచ్చింది. గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన విధంగా తక్కిన వారికి ఇంటి పట్టాలు ఇవ్వాలని స్థాకులు కోరుతున్నారు. తమ సమస్యను సానుకూలంగా పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇంటి పట్టాల కోసం అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నాం. ఎప్పటికప్పుడు ఇంటి పట్టా వస్తుందని ఆశగా ఎదురు చూస్తున్నాం. గత ప్రభుత్వ హయాంలో ఇక్కడున్న వారిలో నలుగురికి పట్టాలు ఇచ్చారు. ప్రభుత్వం మారడంతో మిగిలినవారికి అందలేదు. అధికారులు స్పందించి ఇంటి పట్టాలు ఇవ్వాలి.

– గంగాడ వెంకటేశ్వరరావు, స్థానికుడు

కోడ్ రావడంతో నిలిచిన ప్రక్రియ

గత ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఈ ప్రాంతంపై ప్రత్యేక చొరవ తీసుకుని ఇంటి పట్టాలు ఇప్పించడానికి ప్రయత్నించారు. 30 ఏళ్ల క్రితం ఇళ్లు తీసుకున్న వారిపేరు మీద నివాసాలు ఉన్న నలుగురికి ఇంటి పట్టాలను సైతం అందజేశారు. కొంతమంది ఇళ్లు అమ్ముకోవడం, మరికొంతమంది లేకపోవడంతో వారికి పట్టాలు అందించలేకపోయారు. ఎన్నికల కోడ్ రావడంతో పట్టాల పంపిణీ ప్రక్రియ నిలిచింది.

అప్పులపై శ్వేతపత్రం విడుదల చేయండి

- కూటమి ప్రభుత్వంలో పేదలకు జరిగిన మేలు సున్నా
- వైఎస్సార్ సీపీ సెంట్రల్ సమన్వయకర్త మల్లాది విష్ణు



మధురానగర్(విజయవాడసెంట్రల్): కూటమి పాలనలో ప్రజలకు జరిగిన మేలు గుండు సున్నా అని .. రాష్ట్ర అప్పులపై రాష్ట్ర ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని వైఎస్సార్ సీపీ సెంట్రల్ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 10 నెలల కాలంలో చేసిన రూ. 1.26 లక్షల కోట్ల అప్పులపై వెంటనే శ్వేత పత్రం విడుదల చేసి.. దాన్ని ఎలా ఖర్చు చేశారో ప్రజలకు సమాధానం చెప్పాలని కోరారు. ఆ బాధ్యత కచ్చితంగా సీఎం చంద్రబాబు, డెప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై ఉందని తేల్చి చెప్పారు. ఏడాది తిరక్కుండానే లక్ష కోట్ల పైచిలుకు అప్పులు చేసినా.. సూపర్ సిక్స్ హామీల్లో ఏ ఒక్కటి పూర్తిగా అమలు చేయలేకపోయారని మల్లాది విష్ణు విమర్శించారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో చేసిన అప్పులు రూ. 3,39,590 కోట్లు మాత్రమే అయినా.. అందులో అక్షరాల రూ.2,83,866 కోట్ల మేర పేద, మధ్య తరగతి ప్రజలకు డీబీటీ, నాన్–డీబీటీ ద్వారా మేలు చేకూర్చినట్లు వెల్లడించారు. 2016 డిసెంబర్ నాటికి ఏపీలో 11.77 శాతం ఉన్న పేదరికం.. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత 6.06 శాతానికి తగ్గిందని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన రూ. 1.26 లక్షల కోట్లు ఏమయ్యాయని సూటిగా ప్రశ్నించారు. సాక్షాత్తూ రాష్ట్ర ముఖ్యమంత్రికే లెక్కలపై అవగాహన లేకపోవడం శోచనీయమన్నారు. ఈ ప్రభుత్వంలో చేస్తున్న ఖర్చులకు లెక్కాపత్రం లేకుండా పోయిందని.. ప్రభుత్వం చేసిన అప్పుల కారణంగా ప్రతి వ్యక్తిపై లక్షల రుణ భారం పడుతోందని ఆరోపించారు. అమరావతి రాజధాని నిర్మాణానికి కూటమి ప్రభుత్వం చేస్తున్న అప్పులపై సీఎం చంద్రబాబు పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని మల్లాది విష్ణు ఆరోపించారు. అమరావతికి కేంద్రం రూ.15వేల కోట్లు ప్రపంచబ్యాంక్ ద్వారా ఇప్పిస్తోందని, ఇది పూర్తి గ్రాంట్ అంటూ ఇప్పటి వరకు చేసిన వాదనలు పూర్తి అవాస్తవాలేనని తెలిపారు. పార్లమెంట్ సాక్షిగా అమరావతి కోసం రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అప్పులపై కేంద్ర మంత్రి పంకజ్ చౌదరి వెల్లడించిన అంశాలతో ఇప్పటి వరకు సీఎం చంద్రబాబు చేస్తున్న బుకాయింపులన్నీ అసత్యాలేనని బయటపడిందని వివరించారు. కేంద్రం కేవలం పది శాతం మాత్రమే అంటే రూ. 1500 కోట్లు వరకే గ్రాంట్‌గా ఇస్తుందని వెల్లడించారు. ప్రస్తుతం ప్రపంచ బ్యాంకు నుంచి రూ. 15 వేల కోట్లు, హడ్కో నుంచి రూ. 11 వేల కోట్లు, జర్మనీకి చెందిన కేఎఫ్‌డబ్ల్యూ నుంచి రూ.5 వేల కోట్లు .. మొత్తం రూ. 31 వేల కోట్లు మళ్లీ అప్పులు చేస్తున్నారని మల్లాది విష్ణు విమర్శించారు. కేవలం 10 నెలల కూటమి పాలనలోనే రాష్ట్రం అథోగతి పాలైందని తెలిపారు.

నైపుణ్యంతో జాబ్ అప్లికేషన్ రూపొందించాలి



ఉడతా రమేష్

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఉద్యోగానికి దరఖాస్తు చేసే సమయంలో యువత తమలోని నైపుణ్యాలను, సృజనాత్మకతను జోడించి జాబ్ అప్లికేషన్‌ను రూపొందించాలని మంగళగిరి ఐటీ పార్క్‌లో ఆర్వీ టెక్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధి ఉడతా రమేష్ చెప్పారు. పీబీ సిద్ధార్థ కళాశాల బిజినెస్ అడ్మినిస్ట్రేషన్, కంప్యూటర్ సైన్స్ విభాగాలు సంయుక్తంగా ఉద్యోగ దరఖాస్తు రూపొందించడంలో మెలకువలు అనే అంశంపై అవగాహన సదస్సు సోమవారం కళాశాల ఆవరణలోని వెబ్‌నార్ హాల్లో జరిగింది. రమేష్ మాట్లాడుతూ సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో ఒక ఉద్యోగానికి చాలా మంది అభ్యర్థులు దరఖాస్తు చేస్తున్నారని, వాటిని కంపెనీలు సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి పరిశీలించి అభ్యర్థులను ఎంపిక చేస్తున్నారని చెప్పారు. దరఖాస్తు సమయంలో అభ్యర్థి వివరాలు స్పష్టంగా పూర్తి సమాచారాన్ని పొందుపరచాలన్నారు. విద్యాసంబంధమైన వివరాలు, అభ్యర్థి నైపుణ్యాలు, భాష, గతంలో ఎక్కడైనా పనిచేసి ఉంటే వారి పూర్తి వివరాలతో ఆ కంపెనీల్లో సాధించిన విజయాలు, కంపెనీ వారు సంప్రదించడానికి అవకాశం ఉండేలా సెల్‌ఫోన్ నంబర్, ఈ–మెయిల్ వంటివి పొందుపరచాలని సూచించారు. ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా కూడా జాబ్ అప్లికేషన్స్‌ను సులభంగా రూపొందిస్తున్నారని చెప్పారు. కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగాధికారి డాక్టర్ టీఎస్ రవికిరణ్ మాట్లాడుతూ యువత బాగా చదువుకుని మంచి నైపుణ్యం ఉన్నవారు కూడా జాబ్ అప్లికేషన్ పూర్తి చేయడంలో తప్పులు చేస్తున్నారన్నారు. దానికి జాబ్ అప్లికేషన్ రూపొందించడంలో అవగాహన కోసం సదస్సు ఏర్పాటు చేశామన్నారు. ఏఐ టెక్నాలజీతో అప్లికేషన్ రూపొందించడంపై అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్, డైరెక్టర్ వేమూరి బాబూరావు, కళాశాల డీన్ రాజేష్ సి.జంపాల అధ్యాపకులు, ఎంబీఏ, ఎంసీఏ, ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

ధర్మానికి ప్రతిరూపం శ్రీరామచంద్రమూర్తి



మల్లాప్రగడ

విజయవాడ కల్చరల్: మూర్తీ భవించిన ధర్మానికి ప్రతి రూపం శ్రీరామచంద్రమూర్తి అని ఆధ్యాత్మికవేత్త ఆచార్య మల్లాప్రగడ శ్రీమన్నారాయణ మూర్తి అన్నారు. శృంగేరీ జగద్గురువులు భారతీ తీర్థ మహాస్వామి 75 వర్ధంతి సందర్భంగా ఉత్తరాధికారి విదుశేఖర భారతి ఆదేశంతో దుర్గాపురంలోని శివరామకృష్ణ శ్రవణ సదనంలో నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక కార్యక్రమాలు పురాణ వైభవాన్ని చాటుతున్నాయి. సోమవారం మల్లాప్రగడ.. వాల్మీకి రచించిన శ్రీ మద్రామాయణం అంశంపై ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ కాలాలు మారుతున్నా యుగాలు మారుతున్నా రామాయణ కావ్యం నిత్యనూతనంగా విరాజిల్లుతున్నట్లు తెలిపారు. రామాయణం వినడం చదవడం భక్తి ముక్తి దాయకమన్నారు. రామాయణంలో అరణ్య పర్వంలోని అనేక విషయాలను వివరించారు.

పరీక్ష కేంద్రాల తనిఖీ

పాయకాపురం(విజయవాడరూరల్): కండ్రిక, రాజీవ్‌నగర్, ఎల్‌బీఎస్ నగర్లలోని పదో తరగతి కామన్ పరీక్ష కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్ శ్యామ్ (తిరువూరు) తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరును పరిశీలించారు. బీవీ సుబ్బారెడ్డి మున్సిపల్ హైస్కూల్లో 220 మంది విద్యార్థులకు 218 మంది హాజరయ్యారు. ఎల్‌బీఎస్‌నగర్‌లోని పుచ్చలపల్లి సుందరయ్య మున్సిపల్ హైస్కూల్లో 177 మందికి 175 మంది హాజరయ్యారు. రాజీవ్‌నగర్లోని రాజీవ్‌గాంధీ మున్సిపల్ హైస్కూల్లో 187 మందికి 187 మంది హాజరయ్యారు.

అలరించిన యాదాద్రి మహోద్భవం



విజయవాడ కల్చరల్: ఏపీ సాంస్కృతిక శాఖ, సృజనాత్మక సమితి, దక్షిణమండల సాంస్కృతిక కేంద్రం తంజావూరు ఆధ్వర్యాన సురభి నాటకోత్సవాల్లో భాగంగా సోమవారం సురభి నాటక సంప్రదాయాన్ని పాటిస్తూ దుర్గాపురంలో ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత కళాశాలలోని గోకరాజు గంగరాజు కళావేదిక మీద ప్రదర్శించిన యాదాద్రి మహోద్భవం పద్యనాటకం హృద్యంగా సాగింది. కథ మాటలు, దర్శకత్వం సురభి రఘునాథ్, పాటలు పద్యాలు నల్లాన్ చక్రవర్తుల చక్రవర్తి, నిర్వహణ అవేటి సురభి మనోహర్ చేశారు. కళామందిర్, సురభి కళామందిర్ సంస్థలు, నాటకాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మంగళవారం శ్రీ కృష్ణ లీలలు నాటకాన్ని ప్రదర్శిస్తారు.

నగరంలో మహిళలకు భద్రత కరవు



బాధితులను పరామర్శిస్తున్న మల్లాది విష్ణు, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ

మధురానగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు దౌర్జన్యాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని, భద్రత కరవైందని వైఎస్సార్ సీపీ సెంట్రల్ సమన్వయకర్త మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆవేదన వ్యక్తం చేశారు.

సింగ్‌నగర్ తోటవారి వీధిలో పచారీ దుకాణ నిర్వాహకురాలిపై దాడి చేసి మెడలో 32 గ్రాముల బంగారు గొలుసును గుర్తు తెలియని అగంతకుడు తీసుకు వెళ్లిన విషయంపై బాధిత కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజతో కలిసి సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, పట్టపగలే నగరంలో మహిళలపై దాడులు దౌర్జన్యాలు జరుగుతుంటే పోలీసు వ్యవస్థ ఏం చేస్తోందని సూటిగా ప్రశ్నించారు. నెల రోజులుగా ఈ ప్రాంతాల్లో మోటార్ సైకిళ్లు, ఆటోలు, పెట్రోల్ దొంగలు విపరీతంగా పెరిగిపోయారని దుయ్యబట్టారు. ఇంతటి దారుణాలు జరుగుతున్నా పోలీసు యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోందన్నారు. ఇలాంటి ప్రాంతాల్లో పోలీసులు బీట్‌లు ఏర్పాటు చేయాలని.. పెట్రోలింగ్ నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఘటనలపై సీపీ రాజశేఖర్ బాబును కలిసి వివరిస్తామని ఈ సందర్భంగా మల్లాది విష్ణు చెప్పారు. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీ శైలజ మాట్లాడుతూ అగంతుకులు ఒంటరి మహిళలనే టార్గెట్ చేస్తూ దొంగతనాలు, దాడులు చేస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. కూల్ డ్రింక్ తాగుతానని చెప్పి దాడి చేసి మహిళ మెడలో బంగారు గొలుసు చోరీకి పాల్పడటం దారుణమన్నారు. పోలీసులు ఘటనపై దర్యాప్తు వేగవంతం చేసి నిందితులను అదుపులోకి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నేతలు కృష్ణ మోహన్, పాపయ్య, మీసాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు

'పది' పరీక్షలు ప్రారంభం





నగరంలోని విద్యాసంస్థల్లో సోమవారం పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పాఠశాలల ప్రాంగణాల వద్ద విద్యార్థుల సందడి కనిపించింది. ఉదయం విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లలను కేంద్రంలోకి పంపించి, పరీక్ష పూర్తయ్యేవరకు అదే ప్రాంతాల్లో తిరుగుతూ కాలక్షేపం చేశారు. పది పరీక్షలకు పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ





ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ



ధ్వజస్తంభ ప్రతిష్ఠలో మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, బెవర నారాయణ

పాయకాపురం(విజయవాడరూరల్): ఆలయానికి మూలవిరాట్ ఎంత ముఖ్యమో.. ధ్వజస్తంభం కూడా అంతే ముఖ్యమని వైఎస్సార్ సీపీ సెంట్రల్ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. వాంబేకాలనీలోని శ్రీదేవి భూదేవి సమేత సంతాన వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవం వేద మంత్రాల నడుమ సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. గుడికి వెళ్లగానే ముందుగా కనిపించేది ధ్వజస్తంభమేనని, దేవాలయాల్లో షోడశోపచార పూజలు జరగాలంటే ధ్వజస్తంభం తప్పనిసరిగా ఉండాలని మల్లాది విష్ణు అన్నారు. గర్భగుడిలో ఉండే దైవానికి చేసే అనుష్ఠాన అర్చనల ప్రభావంతో ధ్వజస్తంభానికి కూడా శక్తి కలుగుతుందన్నారు. అందుకే మూలవిరాట్టును దర్శించుకోవడానికి ముందు భక్తులు ధ్వజస్తంభానికి ప్రదక్షిణలు చేస్తారని చెప్పారు. మహాభారతంలో శ్రీకృష్ణుడు ధర్మరాజు కలిసి మయూరధ్వజుని దాన గుణాలను పరీక్షించగా, అతని భక్తికి మెచ్చిన శ్రీకృష్ణుడు మయూరధ్వజునికి యుగయుగాల్లో ఆలయాల ముందు ధ్వజస్తంభంగా పూజలందుకోవాలని వరం ఇచ్చినట్లు మల్లాది విష్ణు వివరించారు. కార్యక్రమంలో బెవర నారాయణ, అవుటుపల్లి నాగరాజు, ఆర్ఎస్ నాయుడు, నీలం ప్రసాద్ రెడ్డి, రాంబాబు, భగవాన్, మీసాల సత్యనారాయణ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రేక్షకులను ఆకట్టుకునే 'కాలగమనం'

చిత్ర హీరో రాజా



కాలగమనం చిత్రం ట్రైలర్ రిలీజ్‌లో చిత్ర యూనిట్

కృష్ణలంక(విజయవాడతూర్పు): గ్రామీణ నేపథ్యంలో తీసిన కాలగమనం చిత్రం ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని చిత్ర హీరో రాజా, హీరోయిన్ లావణ్య రామారావు అన్నారు. గవర్నర్‌పేటలోని బాలోత్సవ భవన్‌లో సోమవారం దర్శకుడు, నిర్మాత బుర్రి సుధాకర్ నిర్మించిన కాలగమనం సినిమా ట్రైలర్ లాంచ్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజా, లావణ్య మాట్లాడుతూ ప్రేమ, కామెడీ, యాక్షన్ సన్నివేశాలు ఉన్న ఈ చిత్రాన్ని ప్రేక్షకులు కుటుంబ సమేతంగా వీక్షించవచ్చన్నారు. అసభ్య సన్నివేశాలు, అసభ్య పదజాలం గానీ ఈ చిత్రంలో లేవన్నారు. దర్శకుడు బుర్రి సుధాకర్ మాట్లాడుతూ గ్రామీణ నేపథ్యంలో తీసిన బలగం చిత్రం ఎంత పెద్ద విజయం సాధించిందో ప్రేక్షకులందరికీ తెలుసని, అదే రీతిలో ఈ చిత్రాన్ని కూడా నిర్మించామన్నారు. వచ్చే నెలలో థియేటర్లలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నామన్నారు. తొలుత ఈ సినిమాకు సంబంధించిన ఒక పాటను ఆవిష్కరించి హీరోహీరోయిన్లు స్టెప్పులు వేసి అందరినీ అలరించారు. జబర్దస్త్ టీమ్ సభ్యులు పంచ్ డైలాగులతో సందడి చేశారు. ముఖ్య అతిథులు ఏపీ ఫిల్మ్ చాంబర్ మాజీ అధ్యక్షుడు మధుమోహన్, వేగ జ్యూవెలరీ అధినేత వనమా సుధాకర్, కాపా శ్రీనివాసరావు చిత్రం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో చిత్ర నటీనటులు, సాంకేతిక నిపుణులు పాల్గొన్నారు.

వినండి.. పరిష్కరించండి

వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర



ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): ప్రజా సమస్యలను అధికారులు విని సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజాఫిర్యాదులు–పరిష్కార కార్యక్రమంలో నగరవాసుల నుంచి ఆయన ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించాలని ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి వాటిని పరిష్కరించాలన్నారు. ప్రజల ఫిర్యాదులను వీఎంసీ శాఖాధికారులు కూడా క్షేత్రస్థాయిలో పరిశీలించాలని, సమస్య ప్రాధాన్యం మేరకు వెంటనే వాటిని పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజా సమస్యలను ప్రత్యక్షంగా వినడం, వాటికి తక్షణ పరిష్కారం కల్పించడం ప్రధాన లక్ష్యం అని పేర్కొన్నారు. పురపాలక సేవలు, రోడ్లు, మంచినీరు, మురుగు కాలువలు, గృహ పథకాలు, వ్యర్థాల నిర్వహణ వంటి అంశాలపై వచ్చిన ఫిర్యాదులను సంబంధిత అధికారులకు అప్పగించి, త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో మొత్తం 31 ఫిర్యాదులను ఆయన స్వీకరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ శుభం నొఖావల్, అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) డి.చంద్రశేఖర్, చీఫ్ ఇంజినీర్ ఆర్.శ్రీనాథ్‌రెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్వీ ప్రసాద్, ఇన్చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్‌బాబు, డెప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జి.సృజన ఇతర అధికారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సీతారామపురం సబ్‌స్టేషన్, 11కేవీ గీతా మందిర్ ఫీడర్ పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతులు, నిర్వహణ పనుల నిమిత్తం ఈ నెల 18వ తేదీ మంగళవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ ఈఈ రవీంద్రబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. చుట్టుగుంట రైవస్ కాల్వగట్టు, సీతారామపురం కాల్వగట్టు, లాల్‌బహదూర్ శాస్త్రి వీధి, ఓల్డ్ ఎంప్లాయిమెంట్ ఆఫీస్ రోడ్డు, కాకానినగర్, సిమెంట్ రోడ్డు, గీతామందిరం రోడ్డు, మేదర బజారు, కోటిలింగాలవారివీధి, నెహ్రూ స్ట్రీట్, చాపరాల వారి వీధి, ఐనవోలు వారి వీధి, ఏలూరు రోడ్డు, రామా కార్పొరేషన్ ఏరియా, శాతవాహన కాలేజీ వెనుక వైపు, ఐకాన్ పబ్లిక్ స్కూల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వివరించారు

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా మధురానగర్ సెక్షన్ 11 కె.వి. నేతాజీ కాలనీ ఫీడర్ పరిధిలో మంగళవారం ఉదయం 8.30 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ పి.రవీంద్రబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేతాజీ కాలనీ, రమాదేవి స్కూల్ రోడ్డు, బావి రోడ్డు, తుంగం కోటేశ్వరరావు రోడ్డు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని పేర్కొన్నారు.